


మెటల్‌రోడ్డు ప్రక్కనే మైలు రాయిని ఆనుకొని కన్పిస్తుంది —పెద్ద మ్రాను. చాలా పొడవుగా వుంది. అది ఒకప్పుడు నిలువుగా వుండేది. పచ్చని ఆకులతో పెద్ద పెద్ద కొమ్మలతో ఎంతో నిండుగా కన్పించేది. దాని పేరు గంగరావి. దానికి ఒక సంఘటన తెలుసు. ఒక జీవిత సత్యం తెలుసు. ఒకనాడు తన నీడ క్రింద జ్యేష్ఠాదేవి చేసిన చేష్ట తెలుసు. ఆ మ్రాను ఇప్పటికీ ఆ సత్యాన్ని మౌనంగా చెబు తున్నట్టే వుంటుంది.

* * *

నీలి మబ్బులు చాటు చేసుకొని నింగిపై సూర్య భగవానుడు నిశాదేవితో దోబూచులాడు తున్న సమయం. ఊరి బయట గంగరావి చెట్టు మీద క్రమేపీ సందడి పెరుగు తోంది. చెట్టు క్రింద ఇటు ప్రక్క[illegible] పచ్చని [illegible] అటు వైపు కాస్త దూరంగా వినబడుతున్న భారమైన నిట్టూర్పులు పక్షులరొదలో కలిసి గాలిలో కలిసి పోతున్నాయి. దూరంగా ఊరి చివర ఇండ్లలోంచి కమ్మరి సమ్మెటపోటు ఇంకా విన పడుతూనే వుంది.

అంతసేపు నిరీక్షించిన గుడ్డివాడికి అప్పుడే [illegible] తట్టినట్లయింది. తలయెత్తి చెవులు నిక్క పొడిచాడు.

“ఒరే గుడ్డి! నీకు పిల్లోడు పుట్టిండు”. అంత పెద్దగా చెవుల్లో అరచింది.

గుడ్డివాడు సంతోషించనూలేదు. ఏడవనూ లేదు. తేలికపడ్డ హృదయంతో గాలి పీల్చు కున్నాడు. అయినా ఎవరు పుడితే వాడికేమిటి? వాడి తాపత్రయం పుట్టబోయే బిడ్డకోసం కానట్లుంది. మరిడీ కష్టపడుతుంటే వాడి కెంతో బాధగా వుంది.

గుడ్డివాడు తడిమి తడిమి అంత [illegible] కున్నాడు.

“ఎట్టుందావే అదీ?”

“ఏంలేదు. బయటపడనాక. తెల్లారినాక తెలు కుంటాదిలే”



# రెండవ బహుమతి కథ

'' నీకింకో జీడకాను. ఇల్లానే. కాళ్ళు పట్టాగా వాడే అంకా''

''అట్లనేరా''.

అంక రెక్కవదిలించుకొని మరలిపోయింది. గుడ్డివాడు ప్రశాంతంగా కళ్ళు మూసుకున్నాడు.

రైలుదిగి చీకటి పడిన తరువాతఊళ్లో కొస్తున్నాడు అవధాన్లు. రావిచెట్టు దరిదాపులకు వచ్చేసరికి చెట్టుక్రిందుగా పసిబిడ్డ ఏడ్పువినిపించింది. పరకాయించి చూశాడు. ఆముదపు దీపం వసక వెలుగులో కనిపించిన దృశ్యానికి అతనికి తల తిరిగినట్లయి కళ్ళు మూసుకున్నాడు. అవధాన్లు స్వతహా వేదాంతి. ఎప్పుడూ తత్వ జిజ్ఞాసతో విహరించే అతని మనసుకు సృష్టి మహా విచిత్రంగా తోచింది. చేతులు జోడించి విశ్వరూపుడికి నమస్కారం చేశాడు. 'పరమేశ్వరా! దేశంలో ఎన్నో ఆసుపత్రులున్నాయి. ఎంతో వైద్య సౌకర్యం వుంది. అయినా స్త్రీలు ప్రసవింపలేకగండాలపాలవుతూనే వున్నారు. మరి ఈ చెట్టు కింద ఒక అనాథ స్త్రీ సుఖంగా ఇప్పుడే ప్రసవించినట్లుంది. ఆమెకు మంచం లేదు చింకి పేలికలు తప్ప సరియైన బట్టలేదు. నెత్తురు మడుగులో పడివుంది. ఆమెకు ఎవరు రక్ష! అవధాన్లు మరేమీ ఆలోచించలేదు. వెన్ను తిరిగి చెట్టు చేరి కష్టంపడి ఊరు చేరుకున్నాడు.

* * *

రచన:

**సి. యస్. రాజు**

"ఓ...ముత్తయ్యోయ్!"

కొలిమిలో తిత్తి వేస్తూ బంగారయ్య పెద్దగా కేక వేశాడు.

దుమ్ము దులుపుకొని కంబళి పరచు కొన బోతున్న బైరాగి ముత్తయ్య తలయెత్తి చుట్టూ చూశాడు.

బంగారయ్య మళ్ళీ దీర్ఘంగా కేక వేశాడు.

"ఓయ్!......యిటు....."

కొలిమి వైపు పరకాయించి చూచి బైరాగి విసుక్కున్నాడు. ఏంది ఈన యెప్పుడు పిలుస్తుంటాడూ! తోసదు గావోసు'. కంబళి మడత పెట్టి గోడ మూలకు విసిరి భారంగా కాళ్ళీడ్చుకుంటూ కొలిమి వద్దకు వచ్చాడు.

"'కూసో... కూసో..... పడుకుందుగానిలే' పొరాటు చెక్క ముత్తయ్య వైపువిసురుతూ బంగారయ్య నవ్వాడు.

చెక్కమీద కూర్చుని కటింగు కొరుతో ఒక చిన్న నిప్పు కణిక అందు కొని ముత్తయ్య గంజాయి చిలుములో వేసుకున్నాడు.

కొలిమిలో మంట బాగా రాజుకుంది. ఇనుప బద్దెనుపైటకు లాగి బంగారయ్య దిమ్మ మీద పెట్టాడు. పని కుర్రాడు పెద్ద సుత్తితో బద్దెను బాదడం మొదలు పెట్టాడు. నిప్పు రవ్వలు అటూ ఇటూ చిందు తున్నాయి.

ఇయ్యాల గుడ్డోడొచ్చినట్టు లేదే?

ఇనుపబద్దెను మళ్ళీ నిప్పుల్లో పెడుతూ అన్నాడు బంగారయ్య.

బైరాగి మాట్లాడలేదు. గంజాయిదమ్ము సన్నాళాని కంటి ఉప్పెనగా యిగ్గపచ్చి వూపిరి సలపక అవస్త పడు తున్నాడు.

మంట మీద మరిన్ని బొగ్గులు కప్పి బంగారయ్య అందు కున్నాడు.

"యాందిసా...మాట్లాడవ్?"

గంజాయి పుచ్చుతానికి బైరాగికి కళ్ళలో నీరు చిమ్మ నట్టుంది. మనిషి వుక్కిరి బిక్కిరై కళ్ళు తుడుచుకున్నాడు. బంగారయ్య గుడ్డివాడి విషయం పదే పదే కదపటం ఎందుకో వాడికి తెలుసు. బైరాగికి నవ్వొచ్చింది. "ఈన కెప్పుడూ మరిడి గోలే...... ఉన్నోడికీ.....లేనోడికీ...... అందరికీ దాని గోలే'

"ఇయ్యాల మరిడి రాలేదు సామీ"అన్నాడు.

బంగారయ్య పకపకా నవ్వాడు.

"ఏం....పురుడోసు కుంటాందా?"

"నాకేటి తెల్సు! నేను సూస్తినా? అది దుయ్యాలో రేపో కంటది. ఏమా యనో ఏమో.

"ఓయ్!... ముత్తయ్యోయ్!...నాకు తెలవదనా! నాకాడ చెప్పకు".

"లే...లే...నాకు తెల్దండి. దాని గోల ఎప్పుడో యిడిచేసినాను". పిడికిలి బిగించి చిలుము నోటి దగ్గరకు లాక్కుంటూ అన్నాడు. బైరాగి.

"ఏందిలే....సెట్టంత మనిషివే...దాన్ని.."

"వద్దొద్దు...దాని పెమేయం యింకొద్దు. నేనన్ని చెప్పినాను మొదట్లో సామీ! గుడ్డోడితో ఎట్టా బతుకు తావే....ఆడికాడ ఏముందాంట. ఇటు చూడవే మరిడీ....నా మాటవిను...నేనేం తక్కువా? అసలు ఆ ముండ యింటేనా!"

ఇనుప పూచతో నిప్పుగాడి కదిలిస్తూ బంగారయ్య అన్నాడు.

"పుట్టి మొండి దశ".

"ఆ దేదో మందెట్టాడు సామీ...పాపని..."

సత్రంలో చోటు కోసం ఒక ప్రక్క బిచ్చగాళ్ళ మధ్య తగవులాట జరుగుతోంది. పెద్దగా బూతులతో తిట్టు కుంటున్నారు. బంగారయ్య విసుక్కున్నాడు.

"అబ్బబ్బ...దొంగ యదవలు.....నోరెప్పు కూసోనీరు. ఒకటే మోత."

"నా కాడకేటి సామీ...మంచోళ్ళు ఎంత మందో లేరూ! ఏడికాడన్నా ఎల్లినాదా! ఆ మాట కొత్తే అసలే అడుక్కునే ఆడోళ్ళంతా ఆడంటే పడి సత్తారు— లేదు సామీ...ఆడేదో మందెట్టాడు. సత్తెం."

"అంతే....అంతే". ఇనుపబద్దెను మధ్యకు వంచుతూ అన్నాడు బంగారయ్య. మరిడి రూపం బంగారయ్యకు పదేపదే కళ్ళముందు కనబడుతోంది. 'కొత్తగా సత్రానికొచ్చినప్పుడు మరిడి సక్కగుండేది. కుర్రది. అందరి కళ్ళు దానిమీద పడినయ్యి. కళ్ళులేనోడి కాడ పడిందది. ముందు ఏడేడ బతికిందో తెలవదు. ఈడ కొచ్చి గుడ్డోణ్ణి కట్టు కున్నాది. ఒళ్ళు కూడా సేసినాది. దేపో మాపో కంటది.....ఉ.....' బంగారయ్య దీర్ఘంగా గాలి వదలి అస్పష్టంగా ఏమిటో గొణిగాడు.

సత్రంలో గొడవకాస్త సద్దుకుంది. బిచ్చగాళ్ళంతా దొరికినంత మేర సర్దుకొని పడుకున్నారు. కొలిమిలో నిప్పు గణగణ రాజుకుంటూనే వుంది. బంగారయ్య ముత్తయ్యతో బాతాకానీ వేస్తూనే వున్నాడు.

"సామీ!" ఉన్నట్టుండి బైరాగి అన్నాడు. బంగారయ్య తలెత్తి చూచాడు.

"మీరేంది పద్దాక దానిగోల సెప్ప మంటారు? అ!......అ!......ఏందింట......." ముత్తయ్య పగలబడి నవ్వాడు.

బంగారయ్య దిమ్మర పోయాడు. ముత్తయ్య అలా అడుగుతాడని అనుకో లేదు. 'ముండా వాడు కనిపెట్టేశాడు. 'ఉ' ...అయినా తనేంది అణ్ణి పద్దాకపిల్చి దాని యిసయం....'' బంగారయ్య అటూ ఇటూ పారచూచాడు. కాస్త దూరంలో అవధాన్లు రోడ్డుమీద వెళ్ళుతుండటం కనుపించింది.

"పో...పో.....పడుకుందు ...... పొద్దోయి నాది." బైరాగి నవ్వు కుంటూ వెళ్ళి పోయాడు. బంగారయ్యకు సభ్యత, అంతస్తు గుర్తొచ్చాయి. అంతటితో ఆ విషయాన్ని వదలి పనిలో మునిగి పోయాడు.

ఆ సత్రంలో పదిమంది వరకూ బిచ్చగాళ్ళు చేరతారు. ఆ రోజు గుడ్డి వాడూ, మరిడీ సత్రానికి చేరలేదు. బిచ్చగాళ్ళకు మొదటి నుంచి గుడ్డి వాడంటే అసూయగా వుండేది. 'గుడ్డోడి అదృష్టంసంచిది. ఆడికీ సక్కంది తోడు దొరికి నాది. అని బిచ్చగాళ్ళను కొంటే 'ముండగుడ్డోణ్ణి వల్లో వేసుకున్నాది'అను కుంటారు బిచ్చ గత్తెలు. అంతా కలిసి వాళ్ళను వెలి వేసినట్టు చూడటం, చీటికీ మాటకీ ఏదో ఒక వంకపెట్టి గుడ్డివాణ్ణి తప్పటం చేస్తుండే వాళ్ళు. గుడ్డి వాడు అన్నీ సహనంగా భరించే వాడు. అయితేమరిడి అంత మందిలోనూ గుడ్డివాణ్ణి ఎందుకు ఆశ్రయించింది? ఆ మాట కొస్తే అసలు బిచ్చ గత్తెలంతా వాడి ప్రాపకానికి ఎందు కలా తాపత్రయ పడేవాళ్ళూ? ఈ సమస్య బైరాగి ముత్తయ్య దగ్గరనుంచి కొలిమిలో పనిచేసే బంగారయ్య వరకూ వుంది. ఆఖరికి గుడ్డి వాడికి కూడావుంది.

గుడ్డివాడు 'పుట్టు గుడ్డి'అంటారు. అయినా గుడ్డివాడు నడిచేవాడు. ఏళ్ళ తరబడి సంపాదించిన అనుభవం వాడిలో వేళ్ళు పాతుకుంది. ఆకలి దారి చూపిస్తే కర్రను ఆధారంగా తీసుకొని భగవంతుడి మీద భారం వేసేవాడు.

'మరిడి ఎలా వుంటుందో'! గుడ్డివాడు ఎప్పటినుంచో అనుకుంటాడు. అసలు వాడికీ గొడవ పట్టక పోను. బైరాగి ముత్తయ్య ఒకసారి వుత్తిపుణ్యానికి కొట్టి తిట్టి నప్పుడు తెలిసింది— మరిడి అందంగా వుంటుందని. 'అందమంటే ఏమిటో!' అదీ తెలియదు. మనిషికి కాళ్ళుంటాయి. తలా, ఇంకా మరికొన్ని అవయవాలుంటాయి. మరి ఇందులో అందమేమిటో!, గుడ్డి వాడికి యీ సమస్యలకు సమాధానందొరకలేదు. విసుగు పుట్టి ఆ విషయాన్ని గురించి ఆలోచించడం మాని వేశాడు. అయితే మరొక విషయం వాణ్ణి పదే పదే బాధ పెట్టేది. బిచ్చ గత్తెలంతా వాడి చుట్టూ మూగి ఆసరాగా వుంటాం ఏలుకోమనేవాళ్ళు. కళ్ళున్న బిచ్చగాళ్ళకు కరువు లేదాయె. అన్ని అంగాలు బాగున్నవాళ్ళూ వున్నారాయె. అయినా బిచ్చగత్తెలంతా వాడి చుట్టూ మూగటం, వాళ్ళలో వాళ్ళు నేనంటే నేనని పోట్లాడు కోవటం, వాణ్ణి అనేక సార్లు చికాకు పరచటం వాడికి వింతగా వుండేది.

"కళ్ళుంటే యెన్నోసూడొచ్చుగంద! బాగా సడవచ్చు గంద! మరి యాంది యీళ్ళంతా నా కాడ కొత్తారూ!" అనుకొనేవాడు. గుడ్డి వాడికి క్రొత్తలో భయమేసి వాళ్ళను దగ్గరకు రానిచ్చేవాడు కాదు. అడుక్కున్న పైసలు కాసిని కొట్టేస్తారేమోనని వాడి భయం. "పోయే... ఆడాలికి......నాకు పెళ్ళమొద్దూ గిళ్ళమొద్దూ." అనే వాడు.అయితే మరిడిలో వాడికి కొంచెం మంచి తనం కనుపించింది. మొదట్లో దాన్ని దగ్గరకు చేరనీక పోయినా క్రమేపీ మరిడివాడిని మంచి చేసుకొంది. తక్కిన బిచ్చ గత్తెలంతా విసుగు పుట్టి వాడి వద్దకు చేరటం మానివేస్తే మరిడి సహనంగా వాడికి సేవ చేసేది. జ్వరమొచ్చి వాడు పడుకుండి పోతే తనకు దొరికిన ముద్దలో వాడికీ కాస్త పెట్టేది. గుడ్డివాడికి నమ్మకం కుదిరింది. వాడు మరేమీ ఆలోచించ లేదు.

కళ్ళు పారవేసి మరిడిని తోడుగా చేసుకొన్నాడు. మరిడికి కావలసిందీ అదే. అలాగే నమ్మకంగా వాడితో బ్రతికేది.

* * *

ఉదయం ఏడు గంటలైనా బైరాగి పడుకున్న చోటునుంచి లేవలేదు. ముసికళ్ళతో అలాగే పడుకున్నాడు. శరీరంలో ఓపిక లేక నిస్సత్తువగా వున్నట్లుంది. బైరాగి మొహం తడుముకున్నాడు. కడుపులో ఒకమూల సన్నగా ఆకలి వేయటం ప్రారంభించింది. బైరాగి సత్రం నలుమూలలా చూశాడు. పిచ్చిగాళ్ళంతా చాలవరకు దినచర్యకు లేచి పోయారు. కాస్త దూరంలో మాదకాలు వెంకాయి అంకతో మాట్లాడుతూ కనుపించాడు, బైరాగి ఒక్క ఉదుటున లేచి అంక దగ్గరకు పరుగెత్తాడు.

"రాతిరి ఏడకెళ్ళినవి?" బైరాగి ఆత్రంగా అంకను అడిగాడు.

"గుడ్డోడికి పిల్లోడు పుట్టిండుగా. నాకు పావలా కాసు పారేసిండు." అంక బొడ్డు తడుముకొని సంబరంగా అంది.

"రాత్తిరి పుట్టిండా! పావలాకాసిచ్చిండా!"

"అడికాడ ఇంకా బోల్డు పైసలున్నయంట సామీ. అంక చూసినాది" మాదకాలు వెంకాయి అందుకున్నాడు. బైరాగి ఆశ్చర్యంగా మొహం పెట్టాడు.

"ఇంత పొడుగుండాది సంచి—నిండా పైసలు పోసిపెట్టుకొని వుండె. నా కళ్ళు చెదిరినాయనుకో?" చేతులతో అభినయిస్తూ అంది అంక. అంక అట్టహాసంగా ఏమిటో చెప్పుక పోతోంది. బైరాగి అసూయగా మొహం పెట్టాడు.

"ఏడ సంపాదించిండు—అన్ని పైసలు?" సగం కాల్చి చెవులో పెట్టుకున్న బీడీతీసి నిప్పు లేక మళ్ళీచెవిలో పెట్టుకొంటూ అన్నాడు వెంకాయి.

బైరాగి యింక వినలేదు. వాడి వళ్ళంతా అసూయతో వుడికి పోతోంది. 'గుడ్డోడికి డబ్బుంది. మంచి పెళ్ళముంది......' బైరాగి మనసంతా వికలమై పోయింది. త్వరత్వరగా తెముల్చుకొని సత్రం విడిచి ఊరు మధ్యకు సాగి పోయాడు.

* * *

మరిడి యిప్పుడు కాస్త లేచి తిరుగుతోంది. గుడ్డివాడు యీ నాలుగు దినాలనుంచీ అడక్కోవడానికి పోవటం లేదు. వాడికీ మధ్య మరిడి దొరకటంలో సంబరిగా నడిచే అలవాటు తప్పి పోయింది. పదిపైసలు ఆశ పెట్టి ఎలాగో బతిమలాడి అంకచేత పురిటి గండం గట్టెక్కించని పించుకున్నాడు. కూడ బెట్టిన సొమ్ము కాస్తా కూస్తా చేతిలో వుంది. అందులోనే పది పైసలు వాడుకుంటూ చెట్టు క్రిందే కాలక్షేపం చేస్తున్నాడు.

మరిడి గంటకు పైగా ఆ ముళ్ళ తుప్పలన్నీ గాలిస్తోంది. దానికి కావలసినదేదో దొరికినట్లు లేదు. గుచ్చుకుంటున్న పల్లేరు కాయల్నివిసుగ్గా తీసేసుకుంటూ వెతుకుతున్నదే గాని వెనక్కు తిరగలేదు.

"యాడుంటదబ్బా!" మరిడి కళ్ళెత్తి దూరంగా వున్న పొదలన్నీ పరిశీలనగా చూసింది. అల్లంత దూరంలో బ్రహ్మజెముడు చెట్టు ప్రక్కగా గాలికి వూగులాడుతోంది—జిల్లేడు మొక్క. మరిడి మొహం వికసించింది. గబగబా నడచి పోయి మొదలంటా జిల్లేడుమొక్క పీకింది. చీకటి పడుతుండటం గమనించి రావి చెట్టు వైపుగా త్వరత్వరగా నడక సాగించింది.

పసివాణ్ణి పొదివి పట్టుకొని వీపుమీద అర—చెయ్యికి చేరవేసి గుడ్డివాడు వచ్చీరాని తత్వ గీతాలు పాడుతున్నాడు. పాడి పాడి విసుగు పుట్టింది. ఎంత సేపటికీ మరిడి వచ్చే సూచనలు కనిపించలేదు. వాడికి విసుగు ఎక్కువవుతుంది 'ఏడకెళ్ళినా దబ్బా! గంట కావత్తంది గందా!' గుడ్డివాడు మెల్లగా గొణగడం ప్రారంభించాడు.

గుడ్డివాడి చేతుల్లో పసివాడి కంత సౌకర్యంగా వున్నట్లు లేదు. బాగా ఏడుపు లంకించుకున్నాడు. పసివాడిని ఎలా ఓదార్చాలో వాడికి తోచటం లేదు. గీతాలు ఎంత సేపు పాడగలడు! అలాగే చేతుల్లో వూపుతూ అవస్థ పడుతున్నాడు.

ఆయాసంగా రొప్పుకుంటూ వచ్చిన మరిడి పసివాణ్ణి చేతుల్లోకి తీసుకుంది. గుడ్డివాడు విసురుకున్నాడు.

"ఏడకెళ్ళినావె! ఆపెట్టా ఏడుత్తుండో సూడు".

మరిడి జవాబు చెప్పలేదు. పసివాణ్ణి కాళ్ళ మీద వేసుకొని జిల్లేడు మొక్క అందుకుంది. గుడ్డివాడు మరిడి ఎక్కడుందో అని చేతులతో తడుముతున్నాడు. రావిచెట్టు భయంగా ఆకులు ముడుచుకుంది. కొమ్మమీద గుడ్లగూబ పిచ్చిగా అరచి ఎగిరి పోయింది. మరిడి పసివాడి కళ్ళలో జిల్లేడు పాలు కొట్టింది. పసిగుడ్డు అదురుతూ గావు కేక పెట్టాడు.

ఆ కేకకు అర్థమేమిటో మరిడికి తెలుసు. ఆకలి కేక అది. ఆకలి గుడ్డిది. అజ్ఞానంగుడ్డిది. మరిడి గుండె తేలికపడింది. పసివాణ్ణి గుండెలకు హత్తుకుంది. 'నా సిన్నికి భయం లేదు, నా సిన్ని బతుకుతాడు. ఆడిబాబులాగ పైసల్ తెచ్చుకుంటాడు. ఆడిలాగసంపాదించుకుంటాడు.

"సిన్నీ! నువ్వు బతగ్గలవురా! అయ్యలాగా బతగ్గలవురా! నీ మీన నాకు బయం లేదురా! సిన్నీ!......" మరిడి పిల్లవాడికి రొమ్మునిచ్చిహాయిగా గాలి పీల్చింది.

యదార్థమెప్పుడూ విచిత్రంగా వుండవచ్చు. ఊహాకందనంత వింతగా వుండవచ్చు. అయితే దాన్ని హేతువుతో ఎవ్వరూ తుడిచి వేయలేరు. పంచభూతాల సాక్షిగా మరిడి ప్రమాణం చేయగలదు. కన్న బిడ్డకు ఏ తల్లి ద్రోహం తలపెడుతుంది. పసి వాడికి నాలుగు రోజుల వయస్సు. ఆ శిశువుకు బ్రతుకు భారంతెలియదు. కన్న తల్లికీ, కడుపుమంటకూ తెలుసు. గుడ్డితనం సానుభూతిని, గుండెల్లో కరుణరసాన్ని రేకెత్తిస్తుంది. తద్వారా పైసలు తెస్తుంది. పసిబిడ్డ యిప్పుడు వికలాంగుడు. ఇంక వాడు మామూలు బిచ్చగాళ్ళకన్నా బాగా బ్రతకగలడు. కళ్ళున్నా పొట్ట కోసం అవస్థ పడకతప్పదు. పైగా చూపు ఆకలిని పెంచవచ్చు. మరిడి అంతవరకే ఆలోచించింది. ఆకలి మంటనించి బిడ్డను కాపాడాననుకుంది. బిడ్డ భవిష్యత్తుకునుంచి బాట ఏర్పరచాననుకుంది.

ఆమె ఆలోచనా పరిధి అంతే!

* * *

సంధ్యవేళ, చెట్టుక్రింద, చింత పేలికల మధ్య మరిడి బిడ్డను కన్నది. బిడ్డక్షేమం కోసం గుడ్డివాణ్ణి చేసింది. మరిడిని కదిలిస్తే యిలాంటి వెన్నో ఉదాహరణలు చెప్పగలదు. గుడ్డివాడు కూడా అలాంటి వాడేనని మరిడి ఇప్పటికీ అనుకుంటుంది.

అంతే.

"మరిడి ఆ గుడ్డోడికాడ వింటుకు సేరి నాదీ?"

"మరిడి నాకాడకెందు కొచ్చాదిసి?"

ఈ సమస్యలన్నీ తేలిపోయాయి. గుడ్డివాడు దేనీ గొణగలేదు. 'మరిడికి బతకటం తెలుసు' అనుకున్నాడు.

వాలు కుర్చీలో పడుకొని జర్మన్ తత్వవేత్త స్టీఫెన్ హోవర్ వ్రాసిన గ్రంథాన్ని చదువుతున్న అవధాన్లు ఆసక్తిగా పుస్తకాన్ని మరింత దగ్గరకు లాక్కున్నాడు. స్టీఫెన్ హోవర్ అడుగుతున్నాడు—"డాన్ టే 'ఇన్ ఫెర్నో' లో నరకాన్ని అంత గొప్పగా చిత్రించాడే!—దానికి తగిన సామాగ్రి, మానసిక సంపత్తి అతనికెక్కడ లభించాయి? మరి స్వర్గాన్ని కూడా ఎందుకు అంత గొప్పగా చిత్రించలేక పోయాడూ?" స్టీఫెన్ హోవర్ సమాధానం సమ్మతగినదిగా తోచింది అవధానికి. స్టీఫెన్‌హోవర్ చెబుతున్నాడు 'డాన్ టే "ఈ ప్రపంచాన్ని చూచే—ఇది ప్రసాదించే సామగ్రి తీసుకొనే అంత గొప్పగా నరకాన్ని సృష్టించాడు. స్వర్గాన్ని అదేవిధంగా చిత్రించడానికి యీ ప్రపంచం తగిన సాధన సంపత్తి అతనికి సమకూర్చలేక పోయింది. అంత పెద్ద అవరోధాన్ని ఎదిరించ లేక స్వర్గాన్ని వర్ణిస్తున్నప్పుడు త్వరత్వరగా తెమిల్చి తెరదించేశాడు..........అవధాన్లు సాగి పోతున్నాడు.

* * *

ఆ తరువాత గుడ్డివాళ్ళ విషయమై పరిశీలన జరుపటానికి తిరిగే ఉద్యోగి ఒకడు ప్రభుత్వ రికార్డులలో కొన్ని వాక్యాలు వ్రాసినగుర్తు.

"దేశంలో గుడ్డివాళ్ళ సంఖ్య పెరగడానికి గలకారణాలలో ఆకలి ఒకటి, అజ్ఞానం ఒకటి..........."

అయితే రికార్డు రూములో చెదలకు ఆకలివేసి ఏనాడో ఆ వాక్యాలను తినివేశాయి.